

విధుల పట్ల అలసత్వం వహించొద్దు

దౌల్తాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహించొద్దని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. దౌల్తాబాద్ పీఎస్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణతో, నిబద్ధతో విధులను నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

కోర్టులపై నమ్మకం పెరిగేలా చూడాలి

» హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ షావ్లీ

మేడ్చల్ టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు కోర్టులపై నమ్మకం కలిగే విధంగా న్యాయవాదులు విధులు నిర్వహించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావ్లీ సూచించారు. అలాగే మహిళా వేధింపు కేసులను త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. శనివారం మేడ్చల్ పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన భవనాన్ని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్, విజయసేన్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వేధింపులు, అత్యాచారాలు, పోక్సో కేసుల్లో బాధిత మహిళలు కోర్టు చుట్టూ తిరగకుండా త్వరగా వారికి న్యాయం చేకూర్చే ప్రయత్నం చేయాలన్నారు. న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి మాట్లాడుతూ యువ న్యాయవాదులు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాక్టీస్ చేయాలని సూచించారు. అన్ని కోర్టులు ఒకే చోటకు తీసుకురావడానికి బార్ అసోసియేషన్ చేసిన కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి కార్యదర్శి విజయగోపాల్ రావు, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఎండీ అఫ్సర్, కోషాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా ఉచిత సేవలు

పరిగి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జైళ్లలో ఉంటున్న ఖైదీలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం పరిగి సబ్‌జైలులో ప్రిజన్స్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైలులో ఉండి బెయిల్ రాని వారికి ఈ క్లినిక్ ద్వారా సేవలు అందుతాయని తెలిపారు. లీగల్ కౌన్సిల్ న్యాయవాదులు స్థానికంగా అందుబాటులో ఉండి ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసు అథారిటీ జిల్లా కార్యదర్శి వెంకవేటశ్వర్లు, కొడంగల్ కోర్టు జడ్జి బి.శ్రీరాం, డిఫెన్స్, కౌన్సిల్ న్యాయవాదులు వెంకటేశ్, గౌస్‌పాష, రాము, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

వర్షపాతం (మి.మీలలో)

వికారాబాద్ జిల్లా	
దోమ	45.0
యాలాల	35.5
దౌల్తాబాద్	29.0
దుద్యాల	28.0
కొడంగల్	28.8
పరిగి	26.3
బషీరాబాద్	24.8
బొంరాస్‌పేట్	24.3
యాలాల	24.3
తాండూరు	24.0

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా శనివారం ఉదయం 6 గంటల నుంచే వాన దంచికొట్టింది. దీంతో దారులన్నీ ఏరులయ్యాయి. మబ్బులు లేకపోయినా రోజంతా వర్షం పడుతూనే ఉంది. ఈసీ, మూసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలోని లక్నాపూర్, అల్లాపూర్ ప్రాజెక్టులు అలుగు పారుతున్నాయి. మరో 24 గంటల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.



శంషాబాద్ మండలంలోని నానాజీపూర్ వాటర్ ఫాల్స్

కుండపోత

ఉమ్మడి జిల్లాలో దంచికొట్టిన వాన

- నిండుకుండల్లా చెరువులు, కుంటలు
- ఉప్పొంగిన ఈసీ, మూసీ నదులు
- పొంగిపొర్లుతున్న లక్నాపూర్, అల్లాపూర్ ప్రాజెక్టులు
- సంగెం కలాన్ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బండలవాగు, దిండివాగు
- పరిసర గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- వికారాబాద్ జిల్లా దోమలో అత్యధికంగా 45మి.మీ వర్షపాతం
- మరో 24 గంటలు భారీ వర్ష సూచన
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



తాండూరు: సంగెంకలాన్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న దిండి వాగు



పెద్దేముల్: ఖానాపూర్ శివారులో మునిగిన పత్తి పంట

వికారాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు కురిసిన వర్షానికి వందల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, కంది, మినుములు, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పలు చోట్ల శిథిల ఇళ్ల గోడలు కూలిపోయాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని హుస్సేన్‌పూర్ పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. దౌల్తాబాద్ మండలంలోని బొంరాస్‌పేట్ మండలంలోని పెద్ద చెరువులోకి భారీగా వరద నీరు వచ్చింది. పంట పొలాల్లోకి భారీగా నీరు చేరడం రైతులను ఆందోళనకు గురవుతున్నారు. తాండూరు మండల పరిధిలోని బెల్కటూర్ బండల వాగు, సంగెంకలాన్ గ్రామ శివారులో

మిగతా 7వ పేజీలో...

వర్షపాతం (మి.మీలలో)

రంగారెడ్డి జిల్లా	
కొందుర్గు	28.8
శంకర్‌పల్లి	28.3
ఫరూఖ్‌నగర్	27.3
షాద్‌నగర్	27.3
మొగిలిగిద్ద	26.5
రాజేంద్రనగర్	24.5
నందిగామ	24.0
మొయినాబాద్	22.8
మహేశ్వరం	22.5
మణికొండ	23.3
శేరిలింగంపల్లి	22.0
మేడ్చల్-మల్కాజిగిరి	
ఉప్పల్	22.8
మల్కాజిగిరి	22.5
మౌలాలి	19.8
ఘట్‌కేసర్	17.3
కీసర	17.5
పీర్జాదిగూడ	16.3

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం పరిగి మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రాజెక్టు నిండి ప్రవహిస్తున్న దృష్ట్యా అలుగు, పరిసరాల్లోకి పర్యాటకులను రానివ్వకూడదని అధికారులకు సూచించారు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, ప్రాజెక్టుల వద్ద ప్రజల రాకపోకలకు ఇబ్బంది కల్గించే పరిస్థితులు రాకుండా చూడాలన్నారు. వర్షాలు ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడ, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే 100 డయల్‌కు కాల్ చేయాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ మోహనకృష్ణ తదితరులు ఉన్నారు.



పరిగి: అలుగు పారుతున్న లక్నాపూర్ ప్రాజెక్టు



కొడంగల్: బొంరాస్‌పేట్ పెద్ద చెరువు వద్ద..



మైసమ్మగూడలో నీట మునిగిన విద్యార్థుల వసతి గృహాలు(ఫైల్)

వానొస్తే వణుకే..!

మైసమ్మగూడకు పొంచి ఉన్న వరద ముప్పు

- నీట మునుగుతున్న వసతి గృహాలు
- కోమటికుంట కాల్వలపై అక్రమ నిర్మాణాలు
- తాత్కాలిక చర్యలతోనే సరి
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, విద్యార్థులు



వసతిగృహాల్లో చిక్కుకున్న విద్యార్థులను జేసీబీ సహాయంతో తరలిస్తున్న స్థానికులు(ఫైల్)

మేడ్చల్ టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వానొస్తే చాలు ఇక్కడి విద్యార్థుల గుండెల్లో వణుకు పుడుతోంది. కొద్దిపాటి వాన కురిసినా పరిసరాలు వరద నీటిలో తేలియాడుతాయి. ఇక ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే సహాయక చర్యలు చేపట్టేంత వరకు విద్యార్థులు బయటికి రాలేని పరిస్థితి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలో ఏటా ఈ పరిస్థితి శరామామూలుగా మారింది. అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టి మమా అనిపిస్తున్నారని స్థానికులు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీతోపాటు, ఇక్కడి పరిసర ప్రాంతాలు వర్షాలకు నీట మునుగుతున్నందున

మిగతా 8వ పేజీలో...

ఉపాధి హామీ పనుల పరిశీలన

» నాగారంలో నేషనల్ మానిటరింగ్ టీం పర్యటన

ధారూరు, జూలై26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగారం పంచాయతీని శనివారం నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం సందర్శించింది. టీం లీడర్ జోసైల్ జోసెఫ్, టీం సభ్యులు పంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పనులను, పీఎంఏవైస్‌పై కింద నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మహిళ సంఘాల సభ్యులతో మాట్లాడారు. వీరి వెంట డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షఫీ ఉల్లా, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.



పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు



ఆదర్శ ఉపాధ్యాయుడు

- బోధనలో ఆయన మేటి
- విద్యార్థులంతా సర్కారు బడిలోనే
- గ్రామస్తుల అభిమానం
- చూరగొన్న మొయినుద్దీన్

6

నేడు జీపీఏ, సర్వేయర్ల పరీక్షలు

» ఏర్పాట్లు పరిశీలించిన అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



నిర్వాహకులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పరిపాలనా అధికారులు, లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం వికారాబాద్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నారు. గ్రామ పరిపాలనా అధికారుల పరీక్షకు 83 మంది, లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్షకు 139 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కాగా, పరీక్షలు జరగనున్న పాఠశాలను శనివారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సందర్శించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన పరీక్ష నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో వాసుచంద్ర, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాంరెడ్డి, డీఎండబ్ల్యువో రాజేశ్వరి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ న్యామత్ అలీ, పరీక్ష నిర్వాహకులు వెంకటేశ్, దేవ్యా, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తదితరులు ఉన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

» వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజారత్నం



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏవో రాజారత్నం

కొడంగల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజారత్నం అన్నారు. శనివారం కొడంగల్ పట్టణంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈపాస్‌లో చూపిన నిల్వలు, భౌతికంగా ఉన్న నిల్వల మధ్య వ్యత్యాసం ఉండొద్దు అని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. యూరియా సమృద్ధిగా లభ్యమవుతుందని, ఆందోళన అవసరం లేదన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ వివరాలతో బోర్డు పెట్టాలి

» మేడ్చల్ డీఏవో చంద్రకళ



మేడ్చల్, జూలై 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఎరువుల దుకాణాల్లోని స్టాక్ వివరాలను రైతులకు తెలిసేలా బోర్డు పెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ రోజు తప్పనిసరిగా ప్రారంభ, ముగింపు ఎరువుల నిల్వ వివరాలు రాయాలన్నారు. నిర్ణీత ధర కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి విక్రయాలను ప్రతి రోజు పరిశీలించాలని ఆదేశించారు.



సభ్యత్వం అందజేస్తున్న నేతలు

స్కావెంజర్ల వేతనాలు విడుదల చేయాలి

» టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

బంట్వారం,జూలై 26(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పాఠశాల పారిశుధ్య కార్మికుల(స్కావెంజర్లు) జీతాలను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బంట్వారం మండలంలోని వివిధ పాఠశాలల్లో పర్యటించిన ఆయన సంఘం సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్కావెంజర్ల పారితోషకం ఇచ్చి ఒక వికారాబాద్ జిల్లాకే ఇవ్వకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 317 జీవోతో స్థానికతగా కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలకు పంపాలన్నారు. జిల్లాలో 610జీవోను అమలు చేయాలని మోడల్ స్కూల్ కేజీబీవీ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు జారీ చేసి, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. ఆయన వెంట అధ్యక్షులు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, నవాబ్‌పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు

100 ఎకరాలకు ఉచితంగా కూరగాయల నారు

జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్

మేడ్చల్, జూలై 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 2025-26లో సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ వ్యవసాయ పరిశోధనా సంస్థ జీడిమెట్ల కేంద్రం నుంచి జిల్లా వ్యాప్తంగా 100 ఎకరాలకు ఉచితంగా కూరగాయల నారు సరఫరా చేయనున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో టమాట, వంకాయ, మిర్చి, క్యాబేజీ, కాలీఫ్లవర్ ఉన్నాయని ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి గల రైతులు, పూర్తి వివరాలకు ఉద్యాన శాఖ అధికారులు ఆర్.స్వప్నిక(8977714464), రామకృష్ణ(8977714251)ను సంప్రదించవచ్చని తెలిపారు.




పాఠశాల వద్ద వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

మైల్వార్‌లో పారిశుధ్యంపై తనిఖీలు

» అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

బషీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైల్వార్ గ్రామంలో శనివారం కేంద్ర బృందం పర్యటించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025 కేంద్ర బృందం అధికారి శ్రీకృష్ణ, జిల్లా కో-ఆర్డినేటర్ లక్ష్మి గ్రామంలోని పలు వార్డుల్లో కలియ తిరిగారు. మురుగు కాల్వల పరిస్థితి, పారిశుధ్యంపై తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా గ్రామంలో పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలపై ఎంపీవో విజయ్‌కుమార్, కార్యదర్శి నర్సింహగౌడ్‌తో మాట్లాడారు. ఎక్కడెక్కడా ఇంకుడు గుంతలు ఉన్నాయేదానిపై వివరాలు సేకరించారు. అనంతరం పాఠశాలలు, మసీదు, అంగన్‌వాడీ భవనం, దేవాలయాల వద్ద పరిశుభ్రతను స్వయంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఈసీ నర్సింహరెడ్డి, టీఏ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ ఉపాధ్యాయుడు

బోధనలో మేటి | పనిచేసే ఊరిలో విద్యార్థులంతా సర్కారు బడిలోనే | అభిమానం చూరగొన్న మొయినుద్దీన్


అంగడిచిట్టంపల్లి ప్రాథమిక పాఠశాల

పూడూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ పోతుంటారు. ఉద్యోగ నిర్వహణ తప్ప సామాజిక బాధ్యత అంతగా పట్టించుకోరు. అయితే కొందరు విధి నిర్వహణేకాకుండా పనిచేసే చోట ఏదో మంచి చేయాలనే తపనతో ఉంటారు. అలాంటి వ్యక్తే పూడూరు మండలం అంగడిచిట్టెంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ ఖాజా మొయినుద్దీన్. ఆయన మొన్నటి వరకు విధులు నిర్వర్తించిన మేడిపల్లికలాన్ ప్రాథమిక పాఠశాల రూపురేఖలను మార్చారు. విధుల్లో ఆయన చూపిన అంకిత భావంతో ఆ గ్రామంలో ఒక్క విద్యార్థి కూడా ప్రైవేట్ స్కూల్లో చేరలేదు. మేడిపల్లికలాన్ నుంచి మొయినుద్దీన్ బదిలీ అయిన ప్రతీసారి గ్రామస్థులు, విద్యార్థులు కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నాలు, నిరసనలు చేసి బదిలీ ఆపించారు. అయితే ఇటీవల జరిగిన టీచర్ల బదిలీల్లో మొయినుద్దీన్ అంగడి చిట్టంపల్లికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు.

100 మందికి చేరిన విద్యార్థుల సంఖ్య

అంగడిచిట్టంపల్లి పాఠశాలకు వచ్చిన ఖాజా మొయినుద్దీన్ కొన్ని నెలల్లోనే పాఠశాల రూపురేఖలు మార్చేశారు. అప్పటి వరకు 40 నుంచి 50 మంది వరకు మాత్రమే ఉన్న విద్యార్థుల సంఖ్యను ఆయన వందకు పెంచారు. పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపకుండా తల్లిదండ్రులను ఒప్పించారు. మొయినుద్దీన్ ఇంగ్లిష్‌లోనే బోధించడం, విద్యార్థులతో ఇంగ్లిష్ మాట్లాడించడం వంటి ప్రకియలు నిర్వహిస్తూ గ్రామస్తుల మన్ననలు పొందుతున్నారు. ఇలాంటి టీచర్లు ప్రభుత్వ స్కూల్లో ఉంటే రూ.వేలు పెట్టి ప్రైవేట్‌కు పంపే అవసరం రాదని తల్లిదండ్రులు అంటున్నారు.

బడిబాటతో తల్లిదండ్రులకు అవగాహన

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా మొయినుద్దీన్ కృషిచేశారు. ఏటా వేసవి సెలవులు, పాఠశాలల పునఃప్రారంభ సమాయల్లో నిర్వహించే బడిబాట కార్యక్రమంలో తోటి టీచర్లతో కలిసి ఇల్లిల్లు తిరిగారు. ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ స్కూల్లోనూ ఉత్తమ విద్య అందిస్తామని భరోసా కల్పించారు. ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధ తీసుకుంటామని విడమర్చారు. దీంతో గ్రామంలో ఏడో తరగతి వరకు చదివే విద్యార్థులంతా వేరే పాఠశాలలకు వెళ్లకుండా గ్రామ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. విద్యార్థులు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సంపాదిస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. సామాజిక కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.


పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటుతున్న టీచర్ మొయినుద్దీన్

ప్రైవేటుకు దీటుగా విద్యనందిస్తాం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉత్తమ విద్యనందించడం నా లక్ష్యం. ప్రభుత్వ పాఠశాల ఉన్న గ్రామంలో ఏ ఒక్క విద్యార్థి కూడా ప్రైవేట్‌కు వెళ్లకూడదన్నది ఆశయం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలున్నాయి. నాణ్యమైన విద్య అందుతుంది. తల్లిదండ్రులకు ఫీజుల భారం తగ్గుతుంది. పాఠశాలలో విద్యార్థులు ఇంగ్లిష్‌లోనే మాట్లాడేలా బోధిస్తున్నాం. మా గురువులు నేర్పిన శిక్షణ, సంస్కారం మా పాఠశాల విద్యార్థులకు నేర్పుతున్నాం. తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం

- మొయినుద్దీన్, టీచర్, అంగడి చిట్టంపల్లి

వికసించిన బ్రహ్మ కమలాలు



ఘట్‌కేసర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పరిధి ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీలో శుక్రవారం రాత్రి బ్రహ్మ కమలాలు వికసించాయి. ఎన్ కాలనీలోని బి-1లో నివాసముండే మాల్లికార్జున్‌రావు నివాసంలో అనేక రకాలు పూల మొక్కలు, పండ్ల చెట్లు పెంచుతున్నారు. ప్రధానంగా తీగజాతి పూల మొక్కలను పెంచుతున్నారు. వీటిల్లో శుక్రవారం రాత్రి బ్రహ్మకమలం మొక్క ఏకంగా 35పూలు పూసింది. చీకట్లో వికసించే ఈ పూలు.. సూర్యోదయం కాగానే వాడిపోవడం వీటి ప్రత్యేకత. భారీగా పూసిన బ్రహ్మ కమలాలను స్థానికులు తిలకించారు.

పంట ధ్వంసంపై ఫిర్యాదు

చౌడాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ పరిధిలోని లింగన్‌పల్లిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణలో గ్రామానికి చెందిన అంజిలయ్యకు సంబంధించిన సర్వే నం:223లోని మూడెకరాల్లో ఉలువ పంట ధ్వంసమైంది. అదే గ్రామానికి చెందిన చంద్రయ్య, యాదయ్య, శ్రీశైలం, వెంకట్‌రాములు, మల్లేశ్, నాగేశ్, అంజి, చెన్నయ్య, ఎల్లమ్మ, భీమమ్మ, శ్రీను, లక్ష్మమ్మ సాగు చేసిన పంటను ధ్వంసం చేశారని శనివారం అంజిలయ్య పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నవాబుపేట ఎస్ఐ విక్రం తెలిపారు.

మైన్స్ ఏడీపై రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు

తాండూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): గనుల శాఖ ఏడీపై తాం దూరు మండలం మల్కాపూర్‌నకు చెందిన ఓ వ్యక్తి రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. మండల పరిధిలోని మల్కాపూర్‌లోని సర్వే నంబర్-75/47/1లో 2ఎకరాల 9గుంటల భూమి ఉంది. ఈ సర్వే నంబర్‌లో అదే గ్రామానికి చెందిన కొత్తూరు శాంత్‌కుమార్‌కు 29గుంటల భూమి ఉంది. అయితే పక్కనున్న భూమివారు తమ 29గుంటల భూమిని కబ్జా చేసి మైనింగ్ కొనసాగిస్తున్నారని కలెక్టర్, మైన్స్ డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు లోకాయుక్తాకు ఫిర్యాదు చేసినట్లు శాంత్‌కుమార్ తెలిపారు. అయితే ఈ నెల 18న ఏడీ సత్యనారాయణ అక్రమార్కులతో కుమ్మక్కై సర్వే నంబర్-75, 76లో కొనసాగుతున్న నాపరాతి గనులకు అక్రమ విద్యుత్‌ను తొలగించారు. నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ తొలగించడంతో నాపరాతి గనుల నిర్వాహకులు తన ఇంటికొచ్చి ఏడీపై పెట్టిన కేసు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని శాంత్‌కుమార్‌కు తెలిపాడు. తన భూమికి డబ్బులు తీసుకోవాలని, లేకుంటే ఇబ్బందులు పడతావంటూ బెదిరిస్తున్నారని చెప్పాడు. మైన్స్ ఏడీ సత్యనారయణ, మరో వ్యక్తితో తనకు ప్రాణహాని ఉందని ఈ నెల 25న రాష్ట్ర భూగర్భ గనుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు శాంత్‌కుమార్ తెలిపారు. ఇదే ఇదే విషయమై మైన్స్ తాండూరు ఏడీ సత్యనారాయణ స్పందిస్తూ.. మల్కాపూర్‌లోని సర్వే నంబర్-75, 76లలో అనుమతి లేకుండా నాపరాతి గనులు చేపడుతున్న విషయం వాస్తవమేనన్నారు. విద్యుత్ కనెక్షన్లను తొలగించామని చెప్పారు. తన భూమిలో తవ్వకాలు చేపడుతున్నారని శాంత్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కార్యకలాపాలు నిలిపివేసినట్లు తెలిపారు. ఆయన భూమి సర్వే చేయించుకోవాలన్నారు. బెదిరించే వారిపై అతడు పోలీసులకు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధపెట్టాలి


పాఠశాలలో మరమ్మతులపై అధికారులు, ఉపాధ్యాయులతో చర్చిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా, వ్యాధులు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులను, మున్సిపల్ అధికారులను అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఆదేశించారు. శనివారం తూంకుంట మునిసిపాలిటీ పరిధి శామీర్‌పేట ప్రాథమిక పాఠశాలను రాధికాగుప్తా, జిల్లా సంక్షేమ ఇన్‌చార్జి అధికారి శారద, విద్యాశాఖాధికారులతో కలసి సందర్శించారు. ఈ పాఠశాలకు రోజూ ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారు, బోధన విధానాలపై ఆమె హెచ్ఎం, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని పెడుతున్నారా? అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల తరగతి గదులను, వంట గదిని, పరిసరాలను అదనపు కలెక్టర్ కలియ తిరిగి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి బాగోగుల, ఆరోగ్యం పట్ల ముచ్చటించారు. ఈ పాఠశాలకు పలు చోట్ల మరమ్మతులు అవసరమని, తొందరగా చేయించాలని హెచ్ఎం, ఉపాధ్యాయులు అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ కావాల్సిన రిపేర్లు చేయించేందుకు నిధుల కోసం అంచనా వేసి ప్రతిపాదనలను తనకు అందజేయాలని మున్సిపల్ అధికారుల ను, టీచర్లను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు వ్యాప్తి చెందకుండా, పిల్లల ఆరోగ్యంపై ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించేందుకు ఒక గదిని కేటాయించాలని, దానికి అవసరమైన మరమ్మతులను వెంటనే చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, డీఈఈ సునీత, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.



మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి


సమావేశంలో బీజేపీ నాయకులు

నందిగామ, జులై 26(ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం నందిగామలోని ప్రిన్స్ ప్యాలెస్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు అరవింద్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి పాటుపడాలన్నారు. నర్సప్పగూడకు చెందిన ఎంకిర్యాల నర్సింహగౌడ్‌కు మండల ప్రధానకార్యదర్శిగా ఎన్నుకొని సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అందె బాబయ్య, నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, మోహన్‌సింగ్, నర్సింహాగౌడ్, లక్ష్మణ్, చెన్నయ్య, మల్లేశ్, ప్రవీణ్‌గౌడ్, హేమంత్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి


ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

షాద్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు సరిపడా యూరియాను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యూరియా కోసం ఫర్టిలైజర్ షాపులు, ఆగ్రో, ప్యాక్స్ సెంటర్ల వద్ద రైతులు గంటలతరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేశంపేట మండల కేంద్రం, కొత్తపేటల్లో యూరియా కొరత ఉండటంతోనే పోలీస్ పహారాలో యూరియా పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం సొంత జిల్లాల్లోనే యూరియా కొరత నెలకొనడం ప్రభుత్వ వైఫల్యం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో యూరియా కొరత లేదన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి : ఎమ్మెల్సీ


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

మాడ్గుల, జూలై 26(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దుచేయకుంటే సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఉద్యమిస్తాయని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. మాడ్గులలో శనివారం పీఆర్‌టీయూ మండల నాయకులు సుధాకర్, అశోక్‌రెడ్డిల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల జెడ్పీ జీపీఎస్ సరెండర్ బిల్లులు రెండేళ్లుగా చెల్లించకపోవడం శోచనీయం అన్నారు. ఆగస్టు 15 కల్లా బిల్లు చెల్లించకుంటే జిల్లా కేంద్రాల్లో మెరుపు సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవేందర్ జీహెచ్ఎం బాల్‌నారాయణ, టీచర్లు పర్వతాలు, లాలూ, వెంకట్‌రాంరెడ్డి, రామలింగం, జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్

దౌల్తాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రాజ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం వాహన తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహనాల అన్ని పత్రాలను కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు

శంషాబాద్‌రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నకిలీ సర్టిఫికెట్లు తయారుచేస్తున్న ముఠా గుట్టును శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు రట్టు చేశారు. ఏపీ విజయవాడకు చెందిన హరీశ్, మవూరి మహేష్ ఇద్దరు కేపీహెచ్‌బీలో శ్రీవ్యాస కన్సల్టెన్సీ పేరుతో నకిలీ బీకాం, బీటెక్ సర్టిఫికెట్లతో పలువురిని విదేశాలకు పంపారు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేపీహెచ్‌బీ పోలీసులు అప్పగించారు. 46మంది విద్యార్థులకు నకిలీ సర్టిఫికెట్లు ఇవ్వగా వారిలో 25మందిని విదేశాలకు పంపినట్టు పోలీసు విచారణలో ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రెండు మొబైల్ ఫోన్లు, ఒక కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ సర్టిఫికెట్లతో వీసాలు పొందిన వారిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. నకిలీ విద్యా పత్రాలపై పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ కేసును కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించిన్నట్లు శంషాబాద్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల పేరిట లబ్ధికి కాంగ్రెస్ ఎత్తుగడ


మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు రిజర్వ్ చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధికి యత్నిస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. ఆమనగల్లులో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ రిజర్వేషపై అసత్య ప్రచారం చేస్తున్నారని, ఈ బిల్లుకు అసెంబ్లీలో బీజేపీ మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల మెనిఫెస్టోలో చెప్పారు గానీ.. పార్లమెంటు ఆమోదిస్తేనే కల్పిస్తామని చెప్పలేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బిల్లు సరైన ప్రక్రియలోనే తెచ్చేవారన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న బిల్లును కేంద్రం ఆమోదించదని అన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, పార్టీ మున్సిపల్, రూరల్ మండల అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, ఎర్రవేలు శ్రీను, నాయకులు నర్సింహ, లక్ష్మణ్, రవి, శేఖర్, శ్రీశైలం, చెన్నకేశవులు పాల్గొన్నారు.

వేగంగా గోశాల పనులు

మొయినాబాద్ రూరల్, జూలై 26 (ఆంధ్యజ్యోతి): సర్వే సంబరు 180లోని 99 ఎకరాల 14గుంటల స్థలంలో గోశాల ఏర్పాటుకు, హెచ్ఎండీఏ పరిధిలో లేఅవుట్ నిర్మాణానికి పనులను ముమ్మరంగా చేపడుతున్నట్టు తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. ఇక్కడ గోశాల ఏర్పాటుతో భూనిర్వాసితులతో పాటు, స్థానికులకూ మేలు జరుగుతుందని, భవిష్యత్తులో గ్రామస్తులకు ఉపాధి దొరుకుతుందని అన్నారు. శనివారం గోశాల పనులను సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ రాజేష్ ఇతర సిబ్బందితో కలిసి పరిశీలించారు. నిర్వాసితులకు ప్రభుత్వం తగిన పరిహారం ఇస్తుందని చెప్పారు.


స్థలానికి ఫెన్సింగ్ వేయిస్తున్న తహసీల్దార్





వినతి పత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

ఖాస్రా పహాని ప్రకారం రైతులకు న్యాయం చేయాలి

● రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ

రంగారెడ్డి అర్బన్ జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఖాస్రా పహాని ప్రకారం ఎన్కేపల్లి రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఏవో సునీల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామం సర్వే నంబర్ 180లో 71 ఏళ్లకు పైగా నిజాం కాలం నుంచి భూమిని పొందిన ఎస్సీ రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ రికార్డు ప్రకారం 1954-55 ఖాస్రా పహానీలో అప్పటి జిల్లా కలెక్టర్ ఎస్సీ రైతులకు అప్పగించిందని తెలిపారు. ఈ భూమిని అప్పట్లో ఎస్సీ రైతులకు అప్పగించి, తోక పాస్ పుస్తకాలు ఇచ్చి తిరిగి వెనక్కి తీసుకుందని తెలిపారు. ఇద్దరి వద్ద తోక పాస్‌పుస్తకాలు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. దాని ప్రకారం ఎన్కేపల్లి ఎస్సీ రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతి చేసిన వారిలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు ప్రభులింగం, రాష్ట్ర కోశాధికారి నేరేందర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి తదితరులున్నారు.



ఆహార పదార్థాల స్టాళ్లను చూస్తున్న రాధికాగుప్తా

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు

శామీర్‌పేట, జూలై26(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతోందని, ఇందుకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. శనివారం తూంకుంట పరిధి హకీంపేటలో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ, పట్టణ పేదరిక నిర్మూలనసంస్థ(మెప్మా) ఏర్పాటు చేసిన ఫుడ్‌ఫెస్టివల్‌ను రాధికాగుప్తా, మున్సిపల్ కమిషనర్ జ్యోతి కలసి ప్రారంభించారు. స్టాళ్లను తిలకించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలను ఇస్తోందన్నారు. మహిళా శక్తి గ్రూపులకు క్యాంటీన్లను ఏర్పాటు చేసి ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తోందని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు రెయిన్‌కోర్టులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్పీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్గిల్ దివస్‌లో అదనపు కలెక్టర్

హకీంపేటలో శామీర్‌పేట గురుకుల డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఇష్రత్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వహించారు. కళాశాల పీడీ హైమవతి, ఎన్‌సీసీ కల్చరల్ కో-ఆర్డినేటర్లు ధనవేణి, అంతుల్ క్యాడెట్లతో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాధికాగుప్తా విచ్చేసి ఎన్‌సీసీ విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డి

గ్రాడ్యుయేషన్ నూతన జీవితానికి నాంది

మొయినాబాద్ రూరల్, జూలై26(ఆంధ్యజ్యోతి): గ్రాడ్యుయేషన్ పట్టా అనేది చదువుకు ముగింపు కాదు. ఇది జీవితంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది. గ్రాడ్యుయేట్స్ అందరూ వృత్తికి, కుటుంబానికి, సమాజానికి మంచి చేయాలని జేఎన్టీయూహెచ్ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం భాస్కర ఇంజినీరింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన వీసీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. విద్యార్థులు పట్టాలు పొందిన తరువాత వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. విద్య నైపుణ్యాన్ని, నైతిక నాయకత్వాన్ని, ఆవిష్కరణ, సమగ్రతను పెంపొందిస్తుందన్నారు. గ్రాడ్యుయేట్లు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జేబీ విద్యసంస్థల కార్యదర్శి జేవీ.కృష్ణారావు మాట్లాడుతూ.. తమ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు ఎంతో మంది దేశ, విదేశాల్లో మంచి స్థాయిల్లో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, జేబీ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



అనాథాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

అనాథాశ్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

శంషాబాద్ రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధి సుల్తాన్‌పల్లి పంచాయతీ పరిధిలో చిల్డ్రన్స్ హెవెన్ ఇంటర్నేషనల్ పిల్లలు అనాథ ఆశ్రమాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. ఆశ్రమ ఫౌండర్ రామచంద్రయ్యను అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తల్లిదండ్రులులేని పిల్లలను పోషించడం సామాన్య విషయం కాదన్నారు. ఇలాంటి సేవాకార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, నాయకులు దండు ఇస్తారి, మల్లికార్జున్, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటపాటల్లోనూ రాణించాలి

మంచాల, జూలై 26(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు ఆటపాటల్లోనూ రాణించాలని లయన్స్ సంస్కృతి 320-డి సంస్థ డైరెక్టర్ మాలతి సూచించారు. శనివారం మండలంలోని ఎల్లమ్మతండా పాఠశాలకు క్రీడా సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల్లో మానసికోల్లాసానికి ఆటలు అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి పాండాల రవిగౌడ్, ఎంఈవో రాందాస్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పద్మ, ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, మాజీ జెడ్పీటీసీ హూనానాయక్, శ్రీధర్, హెచ్‌ఎం మల్లికార్జున్, టీచర్లు పద్మ, ఐలయ్య, జ్యోతి, తిరుమల, మాజీ సర్పంచ్ జగదీష్ పాల్గొన్నారు.

కుండపోత

(ఐదో పేజీ తరువాయి)

దిండి వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్లాపూర్, మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామ శివారులోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అలాగే భారీ వర్షానికి పరిగి మండలంలోని రంగంపల్లిలో ఓ శిథిల ఇల్లు కూలిపోయింది. జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్ సాగర్ వరద నీటితో నిండి జలకళను సంతరించుకున్నాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం వెంకటాపూర్, షాబాద్ మండలం తాళ్లపల్లి, దేవరాపంల్లి వాగు, చందిప్ప సమీపంలోని పతేపూర్ వాగులో నీరు ప్రవహిస్తోంది.

సర్పన్‌పల్లి ప్రాజెక్ట్‌లోకి భారీగా నీరు

వికారాబాద్ జిల్లాలోని శివసాగర్, జుంటుపల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుకుంటుండగా, కోట్‌పల్లి, నందివాగు, కక్రవేణి, కొంశెట్‌పల్లి ప్రాజెక్టుల్లోకి అంతగా నీరు రాలేదు. అలుగెత్తిన పరిగి పరిగి పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్టు లోతు 18 అడుగులు ఉండగా, అల్లాపూర్ ప్రాజెక్టులోతు 10 అడుగులు ఉంది. కోట్‌పల్లి ప్రాజెక్టులో నీటి నిలువ సామర్థ్యం 24 అడుగులు ఉండగా, 13 అడుగుల మేరనీరు చేరుకుంది. సర్పన్‌పల్లి ప్రాజెక్టు 18 అడుగుల సామర్థ్యం ఉండగా, ఇప్పటి వరకు 15 అడుగుల నీరు చేరుకుంది. నందివాగు ప్రాజెక్టులో నీటి నిలువ సామర్థ్యం 16 అడుగులు ఉండగా, 8 అడుగుల మేర నీరు చేరింది. జుంటుపల్లి శ్రీరాముల వారి ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 22 అడుగులు ఉండగా, ఇప్పటి వరకు 17 అడుగుల మీర నీరు వచ్చింది. కొంశెట్‌పల్లివాగు ప్రాజెక్టు 10 అడుగులు ఉండగా, దీంట్లోకి కేవలం 3 అడుగుల మేర నీరు చేరుకుంది. కక్రవేణి ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 14.7 అడుగులు ఉండగా, దీంట్లోకి 7.5 అడుగుల నీరు వచ్చింది.

వికారాబాద్ జిల్లాలో చెరువుల వివరాలు

అలుగు పారుతన్నవి	: 68
75 నుంచి 100 శాతం	: 187
50 నుంచి 75 శాతం	: 144
25 నుంచి 50 శాతం	: 265
25శాతం లోపు నిండినవి	: 523
మొత్తం చెరువులు	: 1,187



పరిగి మండలం రంగంపల్లిలో కూలిన ఇల్లు

29న తాండూరుకు డిప్యూటీ సీఎం రాక

తాండూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు రానున్నారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం తెలిపారు. యాలాల మండలం జుంటుపల్లిలో రూ.200కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు, పాషాపూర్, కొండాపూర్, హాజిపూర్, బెల్కటూర్, నారాయణపూర్, తాండూరు టౌన్‌లలో సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపనచేస్తారన్నారు. తాండూరులో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. పెద్దేముల్, తాండూరు మండలాల లబ్ధిదారులకు రేషన్‌కార్డులను, అందజేస్తారని చెప్పారు.

కాంగ్రెస్ పాలనలో ప్రగతి కాంతులు

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో కల్వకుర్తి నియోజకవర్గం గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తోందని, గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు వసతులు చేకూర్చుతున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి వివిధ పథకాల కింద రూ.15కోట్లతో చేపట్టే పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. పూర్తయిన పనులను ప్రారంభించారు. ఆయా చోట్లజరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పథకాల అమల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తోందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రచారార్భాటమే తప్ప సాధించిన ప్రగతేమీ లేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, తండాలకు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.600కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. రోడ్ల నిర్మాణాలు నాణ్యతతో, వేగవంతంగా చేయించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోందన్నారు. దశల వారీగా ఇల్లు లేని పేదలందరికీ ఇండ్లు కట్టిస్తామని చెప్పారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే రేషన్‌కార్డులు ఇస్తోందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించి గ్రామాల్లో అభివృద్ధిని రెట్టింపు చేసుకుంటూ ప్రజాపాలనలో భాగస్వాములు కావాలని నారాయణరెడ్డి కోరారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, నాయకులు సంజీవ్‌యాదవ్, విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటయ్య, శిశుపాల్‌రెడ్డి, ఆనంద్,భూపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, పర్వతరెడ్డి, మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆత్మగౌరవాన్ని పెంచేలా పథకాల అమలు

తలకొండపల్లి: పేదల ఆత్మగౌరవం పెంపు, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లిలోని దేవకి గార్డెన్‌లో శనివారం రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ ఆధ్వర్యంలో 112 కుటుంబాలకు కొత్తగా మంజూరైన, కొత్తగా పేర్లు చేర్చిన 1,609మందికి ఆహార భద్రత కార్డులను అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ప్యాక్స్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కాసు శ్రీనివాస్‌రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, లక్ష్మీదేవి, రఘురాములు, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, యాదగిరి, పాండు, డేవిడ్, కృష్ణ, శ్రీశైలం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన పవన్



సాయిరాం మృతదేహం

కొత్తూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఎస్ఐ గోపాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం పెద్దతూప్రకు చెందిన చిటికెల పవన్(24) పరిశ్రమలో విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. అతడు పెంజర్ల చౌరస్తా బైపాస్ వద్ద నిలిచి ఉన్న డీసీఎంను ఢీకొని తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం డ్రైవర్ వాహనాన్ని ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా నిలపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామన్నారు. పవన్ సోదరుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

కారు బోల్తాపడి యువకుడు...

కొత్తూర్ మండలం పెంజర్ల శివారులో శుక్రవారం రాత్రి కారు బోల్తా పడి వర్కాల సాయిరాం(21) మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. మహేశ్వరం మండల సుభాన్‌పూర్‌నకు చెందిన సాయిరాం, బొల్లు వెంకటేశ్‌లు కారులో మాణిక్యమ్మగూడ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా పెంజర్లలో రోడ్డు టర్నింగ్ వద్ద కారు బోల్తాపడిందన్నారు. డ్రైవర్ పక్కన కూర్చొన్న సాయిరాం తీవ్ర గాయాలతో అక్కడికక్కడే చనిపోయాడని తెలిపారు. కారు నడుపుతున్న వెంకటేశ్ సైతం గాయపడ్డాడన్నారు. సాయిరాం తల్లి సుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న.. న్యాయమూర్తుల తొలగింపు సరైనదే

» సుప్రీం కోర్టు సీనియర్ అడ్వకేట్ శ్రీరాజురామచంద్రన్ » నల్సార్‌లో సమావేశం



మాట్లాడుతున్న అడ్వకేట్ శ్రీరాజురామచంద్రన్

శామీర్‌పేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): అవినీతి, దుష్ప్రవర్తన ఆరోపణలను ఎదుర్కొంటున్న న్యాయమూర్తుల తొలగింపు విధానం సరైనదే అని, అది పార్లమెంట్ ద్వారా జరుగుతుందని సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విశిష్ట ప్రొఫెసర్ శ్రీరాజురామచంద్రన్ అన్నారు. శనివారం శామీర్‌పేటలోని నల్సార్ వర్సిటీ వీసీ శ్రీక్రిష్ణదేవరావ్ ఆధ్వర్యంలో న్యాయమూర్తుల తొలగింపు ప్రక్రియపై ఉపన్యాస సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరాజురామచంద్రన్ ప్రసంగిస్తూ చట్టాన్ని పక్కనబెట్టి న్యాయ వ్యవస్థలో అంతర్గత విచారణ పద్ధతిని అతిగా వాడటం సరికాదన్నారు. న్యాయ వ్యవస్థ అంతర్గత విచారణలు పార్లమెంట్ అభిశంసన తీర్మానాలను ప్రభావితం చేసేలా ఉండకూడదని, ఇలాంటి పరిస్థితులు రాజ్యాంగ అనిశ్చితికి దారి తీస్తాయని అభిప్రాయపడ్డారు. డిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ యశ్వంత్ వర్మ కేసును ఆయన ప్రస్తావించారు. ఈ కేసులో హైకోర్టు చీఫ్ జస్టిస్ మీద అవినీతి ఆరోపణలను అంతర్గత కమిటీ అభిశంసనకు సిఫారసు చేసిందని తెలిపారు. అయితే ఈ అంతర్గత ప్రక్రియపై కోర్టుల్లో సవాలుకు వీలు కల్పించారని, ఇలాంటి వాటితో చిక్కులు ఉంటాయని వివరించారు. ఒక వైపు న్యాయ విచారణ, మరోవైపు అభిశంసన ప్రక్రియలు సమాంతరంగా జరిగి రెండు రాజ్యాంగ విభాగాల మధ్య సమన్వయం దెబ్బతింటుందన్నారు. పార్లమెంట్ ద్వారా జరిగే మహాభియోగ అభిశంసనే సమగ్ర, రాజ్యాంగ ప్రక్రియ అని రామచంద్రన్ నొక్కి చెప్పారు. ప్రస్తుత రాజ్యాంగ, చట్టబద్ధ పరిమితులను రామచంద్రన్ ఎత్తి చూపారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ అనూప్ సరేందర్‌నాథ్, మాళవిక ప్రాసద్, వర్సిటీ రిజిస్ట్రార్ వాసంతి, ప్రొఫెసర్ సీతారామం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో విజయం సాధించాలి



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

యాచారం, జూలై 26(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు పార్టీ శ్రేణులు శ్రమించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పాపారావు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రూ.500కే వంటగ్యాస్ ఇస్తున్నామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం పచ్చి అబద్ధం అన్నారు. గ్యాస్ రాయితీ ఇస్తున్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోంది గానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదన్నారు. రైతు భరోసా, రూ.2లక్షల రైతు రుణమాఫీ సైతం చాలా మందికి అందలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిబంధనలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేల పింఛనిస్తామని చెప్పి కాంగ్రెస్ పాలకులు మాట నిలుపుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల్లో గెలిచేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములుయాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, నాయకులు తాండ్ర రవీందర్, నడికుడి కృష్ణ, యాదగిరిరెడ్డి, జి.జంగయ్యగౌడ్, కె.మధుకర్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, విజయ్, రమేశ్ తదితరులున్నారు.

కార్గిల్ అమరులను స్మరించుకోవాలి

దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర సైనికులను స్మరించుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పాపారావు, ప్రతాప్ అన్నారు. జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని బీజేపీ నాయకులు అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్గిల్‌లో అసువులుబాసిన మేజర్ పద్మపాణిఆచార్య మన జిల్లావాసి కావడం మనకు గర్వకారణం అన్నారు.

ఎన్నేపల్లి కల్లు దుకాణంలో తనిఖీ

» కేసు నమోదు చేసిన ఎక్సైజ్ అధికారులు



కల్లు నమూనాలు సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

వికారాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని ఓ కల్లు దుకాణాన్ని శనివారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. డీపీఈవో కె.విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ కె.రాఘవీణ, సబ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, వీరాంజనేయులు, సిబ్బంది ఎన్నేపల్లిలోని టీఎఫ్‌టీ కౌంటర్ 5వ దుకాణాన్ని తనిఖీ చేశారు. కల్లు నమూనాను పరీక్షించగా దాంట్లో సీహెచ్ లేదని నిర్ధారణ కాలేదు. సేకరించిన కల్లు నమూనాలను రూల్ 27 ప్రకారం కేసు నమోదు చేసినట్లు డీపీఈవో తెలిపారు. వాటిని రసాయన పరీక్ష కోసం హైదరాబాద్ నారాయణగూడలోని ప్రభుత్వ ప్రయోగశాలకు పంపుతున్నట్లు చెప్పారు. కల్లు తయారీలో ఉపయోగించే నీటి నాణ్యతను పరీక్షించేందుకు లీటరు నీటిని వికారాబాద్‌లో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలోని తాగునీటి సరఫరా విభాగం ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. వర్షాకాలం కల్లు దుకాణాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కల్లు తాగే సీసాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, స్వచ్ఛమైన నీటినే కల్లు తయారీకి వినియోగించాలన్నారు. కల్లులో నిషేధిత మత్తు మందులు కలపొద్దని ఆదేశించారు. ఎవరైనా అజాగ్రత్తగా వ్యవహరించినా, నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నా చర్యలు తీసుకుంటామని డీపీఈవో విజయభాస్కర్ హెచ్చరించారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

» 10 గొర్రెలు మృతి.. మరో 30 జీవాలకు గాయాలు



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు

నందిగామ, జూలై26(ఆంధ్రజ్యోతి): నందిగామలో శనివారం తెల్లవారుజామున గొర్రెల మందపై కుక్కలు దాడిచేశాయి. పది గొర్లు చనిపోగా మరో 30 గొర్రెలు గాయపడ్డాయి. దాసరి శివకుమార్ గొర్రెలను పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం ఉదయం 5గంటల సమయంలో గొర్రెల మంద వద్దకు వెళ్లగా 15 కుక్కలు గొర్రెలను కరుస్తుండగా వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించాడు. ఒక్కడితో అది సాధ్యపడక పోవడంతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. వారంతా వచ్చి కుక్కలను తరిమేశారు. కాగా అప్పటికే పది గొర్రెలు మృతిచెందాయి. పశువైద్య సిబ్బంది చేరుకుని గాయపడిన గొర్రెలకు వ్యాక్సిన్లు వేశారు. కుక్కలదాడితో తనకు రూ.3లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని శివకుమార్ వేడుకున్నాడు.

దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దోస్త్ వెబ్‌సైట్ ద్వారా చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ కాంచన లత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకుగాను ప్రత్యేక దశ ప్రారంభించిందన్నారు. ఈనెల 31వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఏ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ బీఎస్సీ లైఫ్‌సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బెదిరించిన ఇద్దరిపై కేసు

● వడ్డీతో సహా అప్పు చెల్లించానంటున్న బాధితుడు

శంకర్‌పల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై మోకిల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా వివరాలిలా ఉన్నాయి. మోకిలకు చెందిన షేక్ ఫరీద్ 2021లో హైదరాబాద్‌లోని ఆశిష్‌కుమార్ ఆహూజా, సునిల్‌కుమార్ ఆహూజాల వద్ద రూ.17కోట్లు(రూ.2 వడ్డీకి) తీసుకున్నాడు. ష్యూరిటీ కింద 28 గుంటల భూమి, 726గజాల ప్లాటు, మహాలింగపురంలోని 2 గుంటల భూమి, ఖనాపూర్‌లోని ఎకరం భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చానన్నాడు. ఆ భూములన్నింటిలో తానే పొజిషన్‌లో ఉంటూ, తీసుకున్న రూ.17కోట్లకు వడ్డీ కలుపుకుని రూ.22కోట్లను 2022 డిసెంబరులో చెల్లించినట్లు ఫరీద్ తెలిపాడు. డబ్బు తిరిగి చెల్లించినా తన ఆస్తులను తనపై రిజిస్ట్రేషన్ చేయకుండా ఆశిష్‌కుమార్, సునిల్ ఇబ్బందులకు గురిచేస్తూ, జూలై 25న మోకిలలోని 28గుంటల భూమిలోకి సునీల్‌కుమార్ మనుషులు వచ్చి తనను బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ కేసు విషయమై మోకిల సీఐ వీరబాబును వివరణ కోరగా బెదిరింపుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎడతెరిపిలేని వర్షాలు

● పొంగిపొర్లుతున్న చెరువులు, వాగులు ● పంటపొలాల్లో నిలుస్తున్న నీరు


కొడంగల్: హుసేన్‌పూర్ పాఠశాలలో పెచ్చులూడి పడిన పైకప్పు


పెద్దేముల్: గోపాల్‌పూర్‌లోని పత్తిపంటలో నిలిచిన నీరు

తాండూరు రూరల్: బెల్కటూర్ శివారులో తెగిపోయిన తాత్కాలిక రోడ్డు




దౌల్తాబాద్: పెచ్చులూడిన తిరుమలాపూర్ పాఠశాల పైకప్పు


కీసర రూరల్: నాగారం ప్రధాన రహదారిలో చేరిన వరద నీరు


పరిగి: మిట్టకోడూరు మార్గంలో రోడ్డుపై నిలిచిన నీరు


పరిగి: లక్నాపూర్‌లో నీటమునిగిన పత్తి చేను


దోమ: వర్షానికి కూలిన ఇంటిని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్


ఘట్‌కేసర్‌లో కురుస్తున్న వర్షం

బొంరాస్‌పేట్: మెట్లకుంటలో ఇళ్ల మధ్య నిలిచిన వరద నీరు




చౌడాపూర్: అలుగు పారుతున్న కొత్తపల్లి చెరువు

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు, వాగుల్లోకి వరద నీరు భారీగా చేరి అలుగు పారుతున్నాయి. పలు ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. చిరుజల్లులతో గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మరాయి. మరికొన్ని చోట్లవరద ఉధృతికిరోడ్లు తెగి రాకపోకలు నిలిచిపోయాయి. ముసురు వర్షంతో రైతులు వరినాటు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ వర్షం పంటలకు జీవం పోసినట్లైంది. లోతట్టు ప్రాంతాల్లో మాత్రం పంటపొలాల్లో వర్షపు నీరు నిలిచి పంటలు దెబ్బతినే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 26

క్రైం కార్నర్

అహ్మద్‌గూడలో లారీ బీభత్సం

● ఒకరి మృతి, నలుగురికి గాయాలు ● రెండు కార్లు, బైక్ ధ్వంసం

కీసర రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): లారీ బ్రేకులు ఫెయిలై బీభత్సం సృష్టించిన ఘటన శనివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోడుప్పల్‌కు చెందిన మహంకాళి మహేశ్(38) లారీలో స్టీల్ లోడ్‌తో చీర్యాల్ నుంచి నాగారం వైపునకు వస్తున్నాడు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని బ్రిడ్జి వద్దకు రాగానే లారీ బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ముందు ప్రయాణిస్తున్న రెండు కార్లను బలంగా ఢీకొట్టాడు. భయాందోళనకు గురైన లారీ డ్రైవర్ మహేష్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈ ప్రయత్నంలో లారీ నుంచి కిందికి దూకాడు. కంగారులో అతడు రోడ్డుపై పడిపోగా కదులుతున్న లారీ వెనుక చక్రాలు అతడి తలపై నుంచి వెళ్లి అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ ముందుకు వెళ్లి ఓ బైక్‌ను ఢీకొట్టగా ఆ బైక్ ముందు చక్రాలకు అడ్డుగా పడటంతో లారీ నిలిచిపోయింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కాలువిరిగింది. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని క్షత గాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంది పంటను పీకేశారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధారూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): తాను సాగుచేసిన కంది పంటను అటవీశాఖ అధికారులు పీకేశారని మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మండలంలోని దోర్నాల గ్రామంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. దోర్నాల పరిధిలోని సర్వే నంబరు 76/ఆ లో ఎకరం భూమిని తానెం సత్యయ్య అనే వ్యక్తి సాగుచేసి కంది పంట వేశాడు. కాగా గతంలో సాగుచేస్తున్న ఈ భూమి అటవీశాఖ వారు సర్వేలో అటవీ భూమిగా తేలడంతో భూమిని స్వాధీనంచేసుకుని కందకం తవ్వారు. ఈ సంవత్సరం ఇదే భూమిలో రైతు సత్యయ్య కందిపంటను సాగు చేశాడు. అటవీ అధికారులు శుక్రవారం అటవీ భూమిలో కంది మొక్కలను గుర్తించి పీకేశారు. దీంతో మనస్తాపానికి గురైన సత్యయ్య శనివారం పురుగుల మందు తాగి అస్వస్థతకు గురికాగా కుటుంబసభ్యులు ఆయనను వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. సత్యయ్య భార్య స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ధారూరు అటవీ రేంజ్ రేంజర్ రాజేందర్‌ను వివరణ కోరగా దోర్నాల అటవీ బీట్‌లోని 104వ కంపార్టుమెంట్‌లో 8ఏళ్ల కిందట సర్వేచేసి కందకం తవ్వి బయోడీజిల్ ప్లాంటేషన్ చేశారని తెలిపారు. సత్యయ్య వద్ద కాగితాలుంటే సర్వే చేయించుకోవాలని సూచించారు. సర్వేలో భూమి సత్యయ్యదిగా తేలితే వదలివేస్తామన్నారు.

అల్లాపూర్‌లో పరిశుభ్రతకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


అల్లాపూర్‌లో పెంటకుప్పలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

బషీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'పారిశుధ్యం.. అస్తవ్యస్తం!' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బషీరాబాద్ ఎంపీవో విజయ్‌కుమార్ స్థానిక కార్యదర్శిని ఆరా తీసి వెంటనే పారిశుధ్య నియంత్రణ, ప్రత్యేక పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీ ట్రాక్టర్‌తో ఎస్సీవాడలోని రోడ్లపై ఉన్న పెంట కుప్పలను పక్కకు నెట్టి చదును చేయించారు. రోడ్డంతా శుభ్రంగా మార్చి పంచాయతీ కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఎట్టకేలకు అధికారులు పరిశుభ్రతకు చర్యలు తీసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

యాదగిరి సేవలు అభినందనీయం

కొడంగల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు యాదగిరి సేవలు అభినందనీయమని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. కొడంగల్‌లో ఉపాధ్యాయుడు యాదగిరి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శనివారంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమేనని, చేసిన సేవలు గుర్తుండిపోతాయన్నారు. ప్రభుత్వం కెబినెట్‌లో తీర్మానం చేసి ఇస్తామన్న రూ.700 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు.2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు 57 మెమో ద్వారా పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అబ్దుల్ హక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి, మందకృష్ణలకు స్వాగతం పలికిన వడ్ల నందు


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వడ్ల నందు

వికారాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కూకట్‌పల్లిలో శనివారం జరిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అలయ్‌బలయ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగలకు బీజేపీ వికారాబాద్ నియోజకవర్గం నేత వడ్ల నందు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అతిథులు

కీసర రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని రియర్ అడ్మిరల్ కేపీఎస్ వేణుగోపాల్(వీఎస్ఎం రిటైర్డ్) అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ఇన్వెస్టిచర్ (అధికార స్వీకరణ) వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎన్నుకోబడిన విద్యార్థుల మండలిని సత్కరించారు. బాలుర నాయకుడుగా కార్తికేయన్, బాలికల నాయకురాలిగా ప్రజ్ఞ ఎన్నుకోబడ్డారు. వీరితో పాటు మరికొంత మందిని వివిధ హోదాలో నియమితులైన విద్యార్థులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో ఈగిల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత చెన్నప్రగడ, వైస్‌ప్రిన్సిపాల్ వైష్ణవి, హెచ్ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఘట్‌కేసర్: పోచమ్మ ఆలయంలో వార్షికోత్సవ పూజల్లో భాగంగా హోమం నిర్వహిస్తున్న పూజారులు

ఘట్‌కేసర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పోచారంలోని పోచమ్మ, మహంకాళి, ఈదమ్మ ఆలయాల ద్వితీయ వార్షికోత్సవ పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. పోచారంలో గత రెండు సంవత్సరాల కిందట అమ్మవార్లకు ఆలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ వేడుకలో ఎమ్మెల్సీ కవిత హాజరై బంగారు బోనం సమర్పించారు. అప్పటి నుంచి ఆలయంలో బద్దం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాలతోపాటు ప్రత్యేక హోమం నిర్వహించారు. నేడు అమ్మవార్లకు బోనాలు సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకుడు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.బాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కదిరేష్‌చారి, శ్రీశైలం, సత్యానారాయణ, సత్తిరెడ్డి, పూజారులు ఫణీంద్రశర్మ పాల్గొన్నారు.

కులకచర్ల: శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీరామలింగేశ్వస్వామిని భక్తులు దర్శించుకున్నారు. పాంబండ ఆలయ పూజారి పాండుశర్మ వచ్చిన భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.


కులకచర్ల: పాంబండ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కులకచర్ల: బండవెల్కిచర్లలో శ్రీ రుక్మిణి పాండురంగస్వామి ఆలయం వద్ద ప్రతీరోజు హనుమాన్ చాలీసా, భగవద్గీత 12వ అధ్యాయం, శ్రీరామనామ సంకీర్తన నిర్వహిస్తున్నారు. గ్రామ పండరి భజన భక్తుల ఆధ్వర్యంలో గత 156రోజులుగా నిర్వహిస్తున్నారు. లోక కల్యాణం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పండరి భజన భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వానొస్తే వణుకే..!

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థులు ఇక్కడ వసతి గృహాల్లో ఉండటానికి భయపడుతున్నారు. వర్షాకాలంలో కొందరు విద్యార్థులు హాస్టళ్లను వదిలి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. సుమారు 30 వేల మంది విద్యార్థులు ఉంటే ఈ ప్రాంతంలో వర్షాకాలంలో తరుచు తలెత్తే సమస్య గురించి అధికారులు పట్టించుకోక పోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు మండి పడుతున్నారు.

అక్రమ నిర్మాణాలతో ముంపు

స్థానికంగా ఉన్న కోమటికుంట చెరువు కాల్వలను కొందరు పూడ్చివేసి భవనాలు నిర్మించడంతో వరద ఉధృతి పెరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో కోమటి కుంట చెరువు నిండి వరద నీరు కాల్వల నుంచి గుండ మైసమ్మగూడ పరిసరాల నుంచి పారుతాయి. ఇటీవల ఈ కాల్వలను కొందరు పూడ్చి వసతిగృహాల కోసం పెద్ద ఎత్తున భవనాలు నిర్మించారు. దీంతో కోమటికుంట నుంచి వచ్చే వరద కాల్వలు లేక నీరు నేరుగా భవనాల్లోకి, వీధుల్లోకి చేరడంతో పరిసరాలు జలమయం అవుతున్నాయి. ఇక్కడ మల్లారెడ్డి యూనివర్సిటీతోపాటు మరికొన్ని కళాశాలలు ఉన్నందున విద్యార్థుల వసతి కోసం అనేక హాస్టల్స్ వెలిశాయి. కొందరు స్థలాలు కొని నిబంధనలకు విరుద్ధంగా చెరువు కాల్వలను పూడ్చి వసతిగృహాలు నిర్మించడంతో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్తులు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డికి చెందిన మల్లారెడ్డి యూనివర్సిటీ పరిధిలో ఉన్న కాల్వలను పూడ్చి వేసి నిర్మాణాలు చేపట్టటంతో, ఇదే విధంగా తీసుకొని మరి కొందరు దర్జాగా కాల్వలు పూడ్చి భవనాలు నిర్మించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అమరవీరులకు ఘన నివాళి


రిటైర్డ్ సైనికుడు అన్నమయ్యను సన్మానిస్తున్న రవీందర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాండూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకుల పాఠశాల, బాలికల పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో, ఆపరేషన్ సింధూర్‌లో వీర మరణం పొందిన జవాన్లకు కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ మాట్లాడుతూ.. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ సైన్యంపై భారత్ చారిత్రాత్మక విజయం సాధించిందని గుర్తుచేశారు. భారత సైన్యం ఆపరేషన్ విజయ్ పేరుతో ఈ చొరబాట్లను తిప్పికొట్టడానికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో ప్రతిభ చాటిన మహిళ సోఫియా ఖురేషిని ఈ సందర్భంగా విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హస్నాబాద్ రిటైర్డ్ సైనికుడు అన్నయ్యను, పూర్వవిద్యార్థి ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా హారికలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కవిత్రమొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షుడు కేవీఎం వెంకట్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆర్.బిచ్చప్ప, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రిన్సిపల్ ప్రవీణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ వారియర్‌గా మహేశ్


శిఖా గోయల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న మహేష్ కుమార్

తాండూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): తాండూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్‌ను సైబర్ వారియర్‌గా ఎంపికయ్యారు. సైబర్‌నేరాల నియంత్రణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సైబర్ వారియర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసించారు. అందులో తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్ మహేష్ కుమార్ 25మందిలో సైబర్ వారియర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భగా తాండూరు డీఎస్పీ బాలకృష్ణరెడ్డి, పట్టణ సిఐ సంతోష్ కుమార్‌లు మహేష్ కుమార్‌ను అభినందించారు.

అనారోగ్యంతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి

బంట్వారం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పసుపుల రాజు(40) బంట్వారం విద్యాశాఖ కార్యాలయంలో 15ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని నెలలుగా ఆయనకు ఆరోగ్యం బాగాలేదని గురువారం రాత్రి ఒక్కసారిగా కింద పడిపోవడంతో వెంటనే అయనను అంబులెన్సులో మెదక్ జిల్లా సంగారెడ్డి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కొడంగల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఉధృతంగా ప్రవహించే చెరువులు, వాగుల వద్దకు వెళ్లరాదన్నారు. అత్యవసర సమయంలో పోలీసులు, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు


ఘట్‌కేసర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ముల్లి పావని

ఘట్‌కేసర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం ఉండి ఇళ్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ.5లక్షలను అందిస్తోందని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆమె ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ముత్యాలు, ఆంజనేయులు, శ్రీనివాస్, ఖయ్యూం, పారూక్, సిరాజ్, ఖలీం, రాజు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కార్మికులు

తాండూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సీడీఎంఏ కార్యాలయంలో నిర్వహించిన ముట్టడికి తాండూరు మున్సిపల్ కార్మికులు తరలివెళ్లారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రెగ్యులర్ అయ్యేంత వరకు రూ.26వేలు జీతం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ తాండూరు శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్, బి.శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

దుద్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం దుద్యాల మండల కేంద్రంలో తహసీల్దార్ కిషన్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మల్లప్ప, జిల్లా కార్యదర్శి మల్లేశ్, సుధాకర్‌రావు, రవి, ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు


పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

దౌల్తాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరైనవి కావని యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా దౌల్తాబాద్ మండల కేంద్రంలో శనివారం కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పాడికౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, లేని పక్షంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీరన్న, నర్సప్ప, రెడ్యానాయక్, మహిపాల్, చంద్రప్ప, షఫీ, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఘట్‌కేసర్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి శనివారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాష్ట్ర ముఖ్యమంత్రిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. స్థాయిని గుర్తించుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎం. కార్తిక్, రఫీయుద్దీన్, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించాలి


పట్టాలు అందుకుంటున్న సీఎంఆర్ కళాశాల విద్యార్థులు

మేడ్చల్ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువులు చదివి సాంకేతిక రంగంలో రాణించాలని ఇంజినీరింగ్ అండ్ రెస్పాన్సిబుల్ ఏఐ ఫ్రెష్ వర్క్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ గాడే అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పరిధిలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 12వ పట్ట భద్రుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీధర్ గాడే విద్యార్థులకు పట్టాలను అందజేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ వైస్‌చైర్మన్ భూపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనువాసులు రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలి


రోడ్డుపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నవాబుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నవాబుపేట మండల కేంద్రంతో పాటు నవాబుపేట నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు బాగు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. అనంతరం వారు ధర్నా విరమించారు. ధర్నాతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, శ్రీకాంత్ రెడ్డి, జగన్, మహేందర్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను మైనార్టీలకు కేటాయించాలి


మాట్లాడుతున్న నాయకులు

తాండూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్మించబడిన వంద పడకల హాస్టల్ భవనాన్ని గతంలో కేటాయించిన మాదిరిగానే మైనార్టీలకు కేటాయించాలని తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వారు తాండూరులో శనివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాలు మైనార్టీ విద్యార్థుల కోసం వినియోగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, టీఎస్ఎంహెచ్‌పీఎస్ తాండూరు పట్టణ అధ్యక్షుడు సాధిక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కే.చంద్రయ్య, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.